# అమెరికా పనివాళ్ళు-పోలీసులూ

---వంగూరి చిట్టెన్ రాజు, హ్యూస్టన్, టెక్సస్

మా చిన్నప్పుడు "అమెరికాలో పనివాళ్ళు కూడా కార్లో షోగ్గా వచ్చి, ఇల్లంతా శుభ్రం చేసి మళ్ళీ హాయిగా కారులో వెళ్ళిపోతారుట" అనుకునే వారు చాలా మంది గృహిణులు. దాని అర్థం ఏమిటంటే "ఒరేయ్, మొగుడూ అనే యూస్‌లెస్ ఫెలో గారూ, నువ్వూ ఉన్నావు ఎందుకూ, మనకి కారూ లేదు, కనీసం రిక్షా కూడా లేదు" అని లోలోపల అనుకునే వారనమాట. ఈ ఈ పని మనుషులు అంటే మైడ్స్.... వచ్చిన రోజే మా ఇల్లు బావుంటుందనీ, లేకపోతే చండాలంగా ఉంటుందనీ అపోహ పడకండి. అమెరికాలో కార్లో వచ్చే పని మనుషులని పెట్టుకున్నాం కాబట్టి, మా ఇంటి నిండా నగలూ, నాణ్యాలతో తులతూగుతున్నామని కూడా భ్రమ పడకండి. అలాగే ఉంటే, అమెరికామెడిలు ఎందుకు రాస్తానూ. మిగిలిన వాళ్ళ లాగే నేనూ డబ్బు లెక్క పెట్టుకుంటూ రోజులు గడిపే వాణ్ణే కదా!

ముందు జరిగిన కథ ఏమిటంటే ఇంచుమించు మూడేళ్ళ కితం మా ఇంటి ముందుతున్న గడ్డీ గాదమూ చూసి జాలిపడి ఒకానొక మెక్సికనుండు మా తలుపు తట్టాడు. మీ గడ్డి సైజు మీ ఇండియా స్వాములవారి గెడ్డంలా సంస్కారం లేక పెరిగిపోతోందీ, ఇంక కొన్నాళ్ళు ఇలా సాగితే మీ సబ్ డివిజన్ యజమానులు..అంటే హోం ఓనర్స్ అసోసియేషన్ వారు పోలీసులని పిలిచి, మిమ్మల్ని జైల్లో పెట్టిస్తారూ, అది బావుండదు కదా.... ఎందుకంటే మీ కుటుంబం అంతా ఇంట్లో ఎంజాయ్ చేస్తూ ఉంటే, మీరు జైల్లో ఉంటే అదోలా ఉంటుంది కాబట్టి నేను ప్రతీవారమూ వచ్చి పాతిక డాలర్లకి లాన్ కట్ చేసి పెడతానూ, ఏమంటారూ, జైల్లో ఉంటారా, లేక నన్ను సహాయం చెయ్యమంటారా అని అడిగాడు. నేను మన కమ్యూనిష్టుల లాగా కొడవలి చేత్తో పట్టుకుని సుత్తి కొట్టే అలవాటు లేక, మెక్సికనుడి ప్రపోజల్ కి వెంటనే ఒప్పేసుకున్నాను. ఈ సంభాషణ అంతా మా ఇద్దరికీ కామన్‌గా "శరీర భాష" లో జరిగింది. ఎందుకంటే వాడి స్పానిష్ భాష నాకు రాదు, నా అమెరికనైజ్డ్ తూ.గో. జిల్లా తెలుగింగ్లీషు వాడి తాత ముత్తాతలకి కూడా రాదు. అందు చేత కేవలం బాడీ లాంగ్వేజ్ అనగా శరీర భాషలోనే మాట్లాడుకుని కాంట్రాక్టు మాట్లాడుకున్నాం, రాత, కోతలూ, రాతల్లో కూతలూ లేకుండా.

సరిగ్గా వారం తరవాత, మళ్ళీ మెక్సికనుడు మళ్ళీ తలుపు తట్టాడు. ఈ సారి ముందు వరసలో అతని భారీ భార్య, వెనకాల నక్కుతూ ఆ వీరుడూ నిలబడ్డారు. పరాయి ఆడంగులతో, ముఖ్యంగా ఆవిడ తలూకు మొగుడు వెనకాలే నక్కి ఉన్నప్పుడు మంతనాలాడడం మా జిల్లా సాంప్రదాయం కాదు కాబట్టీన్నీ, ఎందుకైనా మంచిదనిన్నీ నేను కూడానా వెనకాల నుంచుని ఉన్న మా క్వీన్ విక్టోరియాని అర్జంటుగా ముందుకు తోసేసి, ఆ బిజినెస్ మీటింగునుంచి నేను తప్పుకున్నాను. వాళ్ళిద్దరూ కూడా శరీర భాషలోనే సంప్రదించుకుని ప్రతీ రెండువారాలకీ, ఆరుబయట ముగుడు గడ్డి పీకుడు సమయంలో ఆవిడ మా ఇల్లు శుభ్రపరిచే ఒప్పందానికి వచ్చారు. అమెరికాలో ఇలాటి కటింగులూ, క్లీనింగులూ స్పానిష్ వాళ్ళే బాగా చేస్తారు. మిగిలిన వాళ్ళందరూ చేయించుకుంటారు.

రెండు, మూడేళ్ళగా ఈ తతంగం బాగానే జరుగుతూ, నేను ఇక పోలీసుల బారి తప్పించుకుని జైలుకి వెళ్ళఖ్ఖర లేని పరిస్థితులు ఏర్పడ్డాయి కదా అనుకుంటూ ఉండగా, నాలుగు వారాల క్రితం ఆ మెక్సికన్ వీరవనిత, తనకి సహాయం చెయ్యడానికి మరొక "కజిన్ మెక్సికన్" ని కూడా తీసుకొచ్చింది. ఆ సాయంత్రం ఎక్కడికో వెళ్ళడానికని మా ఆవిడ తయారవుతూ యధాలాపంగా తన చిన్న సైజు నగల పెట్టె తీసింది. కొంచెం ఖాళీగా ఉందేమిటా అని అన్ని చోట్లా వెతికి, "ఇదిగో, ఈ మధ్య నువ్వు ఏమన్నా గాజులు పెట్టుకుంటున్నావా?" అని అదిగింది నాకేసి అదోలా చూస్తూ. అమెరికాలో అలాటి చూపుకి అర్థం నాకు తెలుసు కాబట్టీ ఆవిడని నేను తీవ్రంగా ఖండించి, ఆ బీరువా అంతా వెతికి, వెతికి, వేసారి మొత్తానికి రెండు బంగారు గాజుల జతలు కనపడడం లేదు అని నిర్ధారణకి వచ్చాం. ఎవరి మీదా అనుమానం లేక, ఎక్కడో పారేసుకుని ఉంటాం అని నగలు పారేసుకునే పద్ధతులన్నీ లిస్టు రాసుకుని, కంప్యూటర్ లోకి ఎక్కించేశాం భవిష్యత్తులో పనికొస్తుందని.

మళ్ళీ రెండు వారాల తర్వాత మా పని మనుషులిద్దరూ ఇల్లు క్లీన్ చేసి బయటకు వెళ్ళగానే మా క్వీన్ విక్టోరియాకి ఎందుకో కొత్తగా వస్తున్న కజిన్ మెక్సికన్ భామ మీద అనుమానం వేసి, మళ్ళీ నగల పెట్టె

తీసిచూడగానే, అంతకు ముందు రోజు రాత్రే తను అందు లోపెట్టిన మిల, మిలా మెరిసే చిన్న నెక్లెస్ మెరవడం మానేసింది. తీరా చూస్తే, అసలు  నెక్లేసే మాయమయిపోయింది.

అనుమానం పెనుభూతమై, బయటకు వెళ్ళి వాళ్ళిద్దరినీలోపలకి రమ్మని గాజులు, నగల విషయం ప్రస్తావించాం. వాళ్ళు "దొంగ తనాలు మా ఇంటా, వంటా లేదు. మా వంశమేమిటీ, గోత్రమేమిటీ" అని  అని తలకాయలు ఊపుతూ, చేతులు తిప్పుతూ ఆవేశపడ్డారు. ఇలా లాభం లేదని, మా జన్మలో మొట్టమొదటి సారిగా మా ఊరి పోలీసులని మా ఇంటికి ఆహ్వానించాం. మొదటి సారి మా ఇంట్లో అడుగుపెడుతున్నారు కదా, హారతి ఇచ్చి, దిష్టితీసి, కుడికాలు ముందు వెయ్యామని అడుగుదామనుకున్నాను కానీ, గుండె ధైర్యము విలోలం  బయ్యే.

ఉన్న మాట చెప్పొద్దూ, అమెరికా పోలీసులు కూడా మన సినిమా హీరో, హీరోల లాగే తెరమీద, ఎక్కడో దూరం నుంచీ మాత్రమే దర్జా గనూ, ధైర్యంగానూ అప్పుడప్పుడు అందంగానూ కూడా ఉంటారు. తీరా మన దగ్గరకి, మనింటికే వచ్చారనుకోండి. మన పనివాళ్ళే బావుంటారు వాళ్ళకంటే.

గత నెలగా మా ఇంట్లో జరిగిని ఈ దొంగతనాల వివరాలూ, మా మెక్సికన్ పనివాళ్ళ మీద మా అనుమానమూ చెప్పగానే, నిగ, నిగ లాడుతూ, ర(క)కాల బేడ్జీలు తగిలించుకున్న ఒక పోలీసు నన్ను చూసి "మీ ఇంట్లో టీన్ ఏజ్ కుర్రకారు పిల్లలు ఎవరైనా ఉన్నారా?" అని అడిగింది. చెప్పొద్దూ, అంత వరకూ ఆ పోలీసు మనిషిని చూసి మన గుమ్మడీ వాళ్ళలాగ మీసాల్లేని మగ పోలీసు అనే అనుకున్నాను. గొంతుక వినగానే హడిలిపోయి, ఆ శరీరాన్ని పైనించి పని కింద దాకా స్పీడుగా చూసేసి, కించిత్తు అవయవ శోభ గమనించి రెండు అడుగులు వెనక్కి వేసి, "హారినీ, ఈ కేసు మన తలుపులమ్మ విజయ శాంతి టైపు" అని కనిపెట్టేశాను. నా దిగ్భ్రమని గ్రహించిన విజయ శాంతి విజయ గర్వంతో నన్ను చూసి, మళ్ళీ అదే ప్రశ్న అడిగింది. "ఉన్నారు అయితే ఏమిటీ?" అని సమాధానం చెప్పింది మా ఆవిడ ఇంకో అరగంట దాకా నా నోరు పెగలదు అని నిశ్చయించుకుని.

"అబ్బే ఇలాటి చిల్లర దొంగ తనాలు ఇంట్లో ఉన్న పిల్లలు సిగరెట్లూ, బీరూ కొనుక్కోవడానికి చేస్తారు" అంచేత ముందు ఆ విషయం పరిశీలించాలి" అని విశదీకరించింది విజయ శాంతి. ఈ దెబ్బకి మా క్వీన్ విక్టోరియాకి కూడా అరగంట దాకా నోరు పెగలదు అని నేను ధైర్యం పుంజుకుని మన పవిత్ర భారతీయ సంతానమూ, వారికి లెఖ్ఖలలో ఎక్కువ మార్కులు వచ్చుట మొదలైన విషయాలు ఏకరువు పెట్టి, మా పిల్లల్లు ఇంటువంటి చిన్నా, చితకా దొంగ తనాలు చేయరు, కానీ కాలేజీలకి వెళ్ళినప్పుడు వేల కొద్దీ డాలర్లు  మాత్రం శుభ్రంగా అడిగే తీసుకుంటారు అని ఇండో-అమెరికన్ సంతానం గురించి క్లాసు పీకాను.

"ఈ మెక్సికనులు దొంగ తనం చేసినట్టు, మీరు చూడ లేదు కాబట్టి, పోయిన వస్తువులు వాళ్ళ బేగులలో దొరికితే మాత్రమే మేము ఏదైనా చెయ్యగలం అని ఈ సారి రెండో పోలీసు... ఖచ్చితంగా మగాడే, ...ఏలనగా మీసములు కనపడుతున్నాయి..... విజయ శాంతికి అసిస్టెంటు లా ఉన్నాడు, అందరి బేగ్ లూ, దర్జాగా ఉన్న వాళ్ళ కారూ వెతికి పెదవి విరిచాడు.

"మరి వ్రేలి ముద్రలు నగల పెట్టెమీద కనపడితేనో?" అన్నాను నా చిన్నప్పటి డిటెక్టివ్ యుగంధర్ లాగా గంభీరమైన గొంతుకతో..... గొంతుక తడి ఆరిపోతున్నప్పటికీ. ఆ పిల్ల ఒక నవ్వు నవ్వు నవ్వి "వీళ్ళు ఇల్లు శుభ్రం చెయ్యడానికి వచ్చారు కాబట్టి, వాళ్ళ వ్రేలి ముద్రలు ఎఖ్ఖడైనా ఉండవచ్చు లా ప్రకారం.. ఆఖరికి మీ ఒంటి మీద కూడా" అనగానే, ఎందుకైనా మంచిదని నేను నా దవడలూ, మొహమూ అర్జంటుగా తుడిచేసుకున్నాను.

ఇక ఆ అసిస్టెంట్ గాడు మా ఆవిడకేసి చూసి "మీరు ఇంకా వాళ్ళ మీద కేసు పెట్టదల్చుకుంటే, మీ ఇష్టం. ఐదారు నెలలు పోయాక, మీరు ఓడిపోతే, తప్పుడు కేసు పెట్టినందుకు మేమే మీ మీద కేసు పెడతాం, ఇంతకీ మీ పిల్లల గదులెక్కడా?" అడిగాడు.

"సర్లే, ఉద్ధరించావ్, కేసూ లేదు, పాడూ లేదూ, అందరూ బైటకి వెళ్ళండి. కాస్సేపుంటే మమ్మల్ని అందరినీ జైలుకి లాక్కుపోయేలా ఉన్నావు? బుద్ధి తక్కువై పిల్చాను మిమ్మల్ని. ఇదే మా ఇండియాలో మా వెంకట స్వామి, వాళ్ళిద్దరినీ రెండు తగల్నిచ్చి, దాచిన చోటనుంచి నా నెక్లెస్ సంపాదించేశేవాడు" వెధవ అమెరికా, వెధప పోలీసులూ, వెధవ పనివాళ్ళూ.....మా గంగమ్మా, సూన్నారాయణే నయం" చతికిలపడిపోయింది అంతటి మహారాణీ నూ.

*****